సాక్షి రంగారెడ్డి

సోమవారం । 25 । నవంబర్ । 2024



పత్తి రైతు పరేషాన్

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేక రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. 8లో▸



మత్స్యకారుల అభివృద్ధికి కృషి

మత్స్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

చేపల పెంపకం పరిశీలన



ఉత్తరాఖండ్ మంత్రిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) నేషనల్ ప్రెసిడెంట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత నర్రా రవికుమార్ మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద నెలకొల్పిన చేపల పెంపకం కేంద్రాన్ని ఆదివారం ఉత్తరాఖండ్ మంత్రి సౌరబ్ బహుగుణ సందర్శించారు. చేపల పెంపకం, మార్కెట్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షులు అంజన్‌కుమార్‌గౌడ్, నాగేష్, శ్రీరాములు తదితరులు ఆయనను సన్మానించారు.

సగర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



భగీరథుడికి పూజలు చేస్తున్న సంఘం నాయకులు

తుక్కుగూడ: ప్రభుత్వం సగర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సాగర్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సగర సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సగర్లను సంచార జాతిగా గుర్తించి బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని కోరారు. గత ప్రభుత్వం తమ విజ్ఞప్తి మేరకు తాగునీటి పనులకు మిషన్ భగీరథ పేరు పెట్టిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమ సమస్యలు పరిష్కరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్, నాయకులు సురంపల్లి సుధాకర్, సత్యం, మందాడి ఉదయసాగర్, మర్క సురేష్, మహేందర్, మరక సతీష్, చిలుక శ్రీకాంత్, నారాయణ, ఉప్పరి రవి తదితరులు పాల్గొన్నారు.

అంధుల చెస్ పోటీల్లో ఆకాశ్ ప్రతిభ



నేషనల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న ఆకాశ్

ఇబ్రహీంపట్నం: జాతీయ జూనియర్ చెస్ అంధుల చాంపియన్‌షిప్ 2024ను ఇబ్రహీంపట్నంకు చెందిన ఆకాశ్ సొంతం చేసుకున్నాడు. ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ ద బ్లైండ్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈనెల 20, 21,22 తేదీల్లో నేషనల్ జూనియర్ చెస్ చాంపియన్ షిప్ ఫర్ ద విజువల్ చాలెంజ్‌డ్–2024 (అంధుల) పోటీలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంకు చెందిన వడ్లకొండ నాగరాజు కుమారుడు ఆకాశ్ నగరంలోని బేగంపేట దేవనార్ అంధుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో చెస్ చాంపియన్‌గా విజయం సాధించిన నేపథ్యంలో బెంగళూరులో జరిగే జాతీయ చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో ఆకాశ్ తన ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి చెస్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆకాశ్ మాట్లాడుతూ.. జాతీయ చాంపియన్‌షిప్ సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నాడు.

చలితో గజగజ

సాక్షి, సిటీబ్యూరో: చలి గజగజ వణికిస్తోంది. తెల్లవారు జామున పొగ మంచు కమ్మేస్తోంది. పగటి గరిష్ట ఉష్ణోగ్రత కూడా తగ్గుముఖం పట్టి 29 డిగ్రీలకు చేరింది. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి చలి తీవ్రత పెరిగింది. నగరం మొత్తం మీద సగటున కనిష్ట ఉష్ణోగ్రతలు 15.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా సగటున 12.4 డిగ్రీల సెల్సియస్ రికార్డు అయింది. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.





భక్త జన జాతర

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా చేరుకున్నారు. ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మహిళలు కార్తీక దీపారాధన, తులసి పూజ చేశారు. మరికొంత మంది ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. – మంచాల

సిబ్బంది లేక.. సర్వే సాగక

ఇటు రహదారులు.. అటు చెరువులు

- రెండు మండలాలకు ఒక సర్వేయర్
- జిల్లాలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 2,500 పైగా దరఖాస్తులు పెండింగ్
- భూ బాధితులకు తప్పని నిరీక్షణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో భూ క్రయ, విక్రయాలే కాదు విస్తీర్ణం, సరిహద్దు వివాదాలు కూడా ఎక్కువే. ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములతో పాటు రియల్ ఎస్టేట్ వెంచర్లలో వెలిసిన ఖాళీ ప్లాట్ల సరిహద్దుల విషయంలో తరచూ వివాదాలు తలెత్తుతుంటాయి. భూ విస్తీర్ణం సహా సరిహద్దుల నిర్ధారణ కోసం ప్రైవేటు సర్వేయర్లను సంప్రదిస్తారు. వారిచ్చే రిపోర్టులపై విశ్వసనీయత లేకపోవడంతో మెజార్టీ భూ బాధితులు ప్రభుత్వ సర్వేయర్లను ఆశ్రయిస్తుంటారు. జిల్లా నిష్పత్తి మేరకు సర్వేయర్లు లేకపోగా, ఉన్నవారు కూడా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ, రీజినల్ రింగ్‌రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ఫోర్త్‌సిటీ కోసం చేపట్టే భూ సేకరణలో బిజీగా మారారు. ఫలితంగా భూముల సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న 2,500 మందికిపైగా భూ బాధితులకు నెలల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. పక్కనే ఉన్న హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్లను డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి పని పూర్తి చేయించే అవకాశం ఉన్నా.. జిల్లా అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ప్రాజెక్టుల్లోనే వాళ్లంతా బిజీ

హైదరాబాద్ జిల్లాలో ఖాళీ స్థలాలు పెద్దగా లేవు. 16 మండలాలకు గాను 19 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక్కడ భూ వివాదాలు కూడా చాలా తక్కువ. వీరికి పెద్దగా పని కూడా లేదు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, 18 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక 27 మండలాలు ఉన్న కీలకమైన రంగారెడ్డి జిల్లాలో మాత్రం 14 మందే ఉన్నారు. రెండు, మూడు మండలాలకు ఒక సర్వేయర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రభుత్వ భూముల సర్వేకు తోడు.. ప్రాజెక్టులు, రోడ్ల కోసం ప్రభుత్వం చేపట్టే భూ సేకరణలో వీరంతా బిజీగా మారుతున్నారు. సాధారణ భూ బాధితులు సర్వే కోసం దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా.. అటు వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి. వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాలనే భూ బాధితుల్లో ఉన్న బలహీనతను కొంతమంది సర్వేయర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఏరియా, భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. గతంలో గండిపేట మండల సర్వేయర్ ఒకరు ఇదే అంశంపై పట్టుబడటం విశేషం.

ఉద్దేశపూర్వకంగానే..

జిల్లా అవసరాలు, సర్వేయర్ల కొరత, తలెత్తుతున్న సమస్యలను ముందే గుర్తించి ప్రభుత్వానికి తగిన నివేదిక అందజేయాల్సి ఉంది. కానీ ఓ జిల్లా స్థాయి అధికారి ఉద్దేశపూర్వకంగానే కొత్త సర్వేయర్ల కేటాయింపు అభ్యర్థన ఫైలును తొక్కిపెడుతున్నట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో.. సరిహద్దు జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్ల సేవలను వినియోగించుకునే అవకాశం ఉన్నా.. జిల్లాపై తనకున్న గుత్తాధిపత్యం ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోననే భయంతో పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఉద్దేశ పూర్వకంగానే సర్వేయర్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు సర్వేయర్ ఏసీబీ కేసులో పట్టుబడి ఖాళీగా ఉన్న మణికొండ సహా, రాజేంద్రనగర్, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం, హయత్‌నగర్, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో తనకు అనుకూలమైన వారిని నియమించుకుని, వారి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి.

గ్రేటర్ జిల్లాల్లో సర్వేయర్లు ఇలా..

జిల్లాపేరు	మండలాలు	సర్వేయర్లు
హైదరాబాద్	16	19
మేడ్చల్	15	18
రంగారెడ్డి	27	14

ఉద్యమాలకు ఊపిరి దొడ్డి కొమురయ్య

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: భూమి కోసం, భుక్తి కోసం, దాస్య విముక్తి కోసం పోరాటం చేసిన కొమురయ్య ఉద్యమాలకు ఊపిరిగా నిలిచారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కొనియాడారు. కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై జిల్లెలగూడ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమురయ్య పోరాటాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాకారులు నిర్వహించిన ధూంధాం కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు సిద్ధాల మహేశ్, కార్పొరేటర్లు సిద్ధాల లావణ్య, సిద్ధాల మౌనిక, సిద్ధాల బీరప్ప, సిద్ధాల పద్మ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేందర్‌రెడ్డి, పోరెడ్డి పద్మ పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

తుకారాంకు సన్మానం



యాచారం: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం మోహిదీపట్నంలోని మిల్ట్రీ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి అంగోత్ తుకారాంను ఘనంగా సన్మానించారు. అంగోత్ తుకారాం ఎవరెస్ట్ అధిరోహించకముందు ఎన్‌సీసీలో శిక్షణ పొందాడు. తుకారాం తాను ఎవరెస్టును ఎలా అధిరోహించాడో యువ కార్యక్రమంలో భాగంగా యువతకు వివరించాడు. పర్వతారోహణపై వారికి అవగాహన కల్పించాడు.



❖ సూపర్ పెట్

నగరంలోని నార్సింగి వేదికగా ఓం కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన ‘పెడిగ్రీ ప్రో హైకాన్–24’ షో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో 500కు పైగా శునకాలు, 100కు పైగా పిల్లులు అలరించాయి. సుమారు 5 వేల మంది పెట్ లవర్స్ పాల్గొన్నారు.



చౌకగా.. చక్కగా..

- మరో 30 జన్‌పోషణ్ కేంద్రాలుగా రేషన్ దుకాణాలు
- ఇప్పటికే 15 ఈ తరహా షాపులు
- నిత్యావసర సరుకులు సహా చిరు ధాన్యాలు, పప్పులు లభ్యం
- గ్రేటర్ నగరంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరో 30 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు త్వరలో జన్ పోషణ్ (ప్రజా పోషక) కేంద్రాలుగా మారనున్నాయి. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 15 రేషన్ షాపుల్లో ఇవి కొనసాగుతుండగా.. మరికొన్ని కేంద్రాలను ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మరిన్ని ఉత్పత్తులను ప్రజలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టిన విషయం విదితమే. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మూడు నెలల క్రితం తొలి విడతలో ప్రారంభించిన కేంద్రాలకు మంచి స్పందన లభిస్తుండటంతో తాజాగా మరో 30 జన్ పోషణ్ కేంద్రాలకు అనుమతించింది. ఎంపిక చేసిన రేషన్ షాపుల డీలర్లకు మూడు రోజులు పాటు సరుకుల విక్రయాలు, నిల్వల తీరుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కేంద్రాల్లో తృణ ధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, రోజువారీ నిత్యావసర సరుకులు సహా వివిధ ఉత్పత్తులను విక్రయిస్తారు. దశల వారీగా రేషన్ షాప్‌లను పూర్తిగా ఆధునికీకరించి నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

తక్కువ ధరల్లోనే..

జన్ పోషణ్ కేంద్రాల్లో నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో లభించే ధర కంటే తక్కువ ధరకు నాణ్యత కలిగిన నిత్యావసర సరుకులు విక్రయించనున్నారు. ప్రజా పంపిణీ పథకం కింద పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యం, సబ్సిడీ, గోధుమలు, కిరోసిన్, చక్కెర తదితర వంటివి మినహాయించి, కంది పప్పు, శనగ, పెసర పప్పు, కొర్రలు, సజ్జలు తదితర పోషకాహార సరుకులను విక్రయించే విధంగా ఏర్పాటు చేశారు. సబ్బులు, అగ్గిపెట్టెలు, పప్పులు, పాలు, నూనెలు, ఉప్పు, బెల్లం, ఉల్లిగడ్డలు వంటివి కూడా విక్రయించేందుకు డీలర్లకు వెసులుబాటు కల్పించారు.

డీలర్లకు ఆర్థిక చేయూత

రేషన్ డీలర్ల ఆదాయాన్ని పెంచేందుకు జన్ పోషణ్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ఒకవైపు ప్రజలకు పోషక పదార్థాలు అందించడంతోపాటు డీలర్లకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్రాలు కలిసి వచ్చే విధంగా కేంద్రం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాలు కేవలం పీడీఎస్ బియ్యంతో పాటు సబ్సిడీ సరుకుల పంపిణీకే పరిమితమయ్యాయి. ప్రతి నెలా మొదటి వారం తర్వాత పది రోజులు మాత్రమే నిర్ణీత సమయంలోనే రేషన్ దుకాణాలు పని చేస్తుంటాయి. మిగిలిన రోజుల్లో సరుకుల పంపిణీ గడువు ముగియడంతో దుకాణాలను మూసివేయడం షరామామూలైంది. దీంతో రేషన్ డీలర్లకు సబ్సిడీ సరుకుల పంపిణీపై వస్తున్న కమీషన్లు కనీసం మడిగ కిరాయికి సైతం సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో దుకాణాల నిర్వహణ కష్టంగా తయారైందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సికింద్రాబాద్ పరిధిలో జన్ పోషణ్ కేంద్రం

6.36 లక్షల కుటుంబాలు

హైదరాబాద్ పౌర సరఫరాల విభాగం పరిధిలో సుమారు 653 రేషన్ షాపులున్నాయి. వీటి పరిధిలో 6.23 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులున్నాయి. ఇందులో దాదాపు 23.61 లక్షల సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా 80 నుంచి 90 శాతం వరకు లబ్ధి కుటుంబాలు సబ్సిడీ సరుకులు డ్రా చేస్తుంటాయి. రేషన్ షాపులు జన్‌పోషణ్ కేంద్రాలుగా మారుతుండటంతో ఇతర నిత్యావసర సరుకులు కూడా కొనుగోలు చేస్తుండటంతో మరింత కలిసి వస్తోంది. దీంతో పౌరసరఫరా శాఖ మరిన్ని రేషన్ షాపులను జన్‌పోషణ్ కేంద్రాలుగా మార్చే పనిలో పడినట్లు కనిపిస్తోంది.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

శంకర్‌పల్లి: మన దేశ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకుంటూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. కార్తీక సమాసం సందర్భంగా మండల కేంద్రంలోని డీఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో 132 మంది జంటలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తిభావం పెంచేలా మంచి భక్తి కథలను చెప్పాలని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయల గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలని సూచించారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. సామాజిక సమరసత ఆధ్వర్యంలో ఇలాంటి భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సామాజిక సమరత జిల్లా కన్వీనర్ దామోదర్‌రెడ్డి, శంకర్‌పల్లి సభ్యులు శ్రీను, లక్ష్మీరెడ్డి, నందు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తీగుళ్ల నర్సింలు, నర్సింహారెడ్డి, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్



132 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మత్స్య కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు చేపలు పంపిణీ చేస్తున్నామని ఓ పక్క గొప్పలు చెప్పి.. మరోపక్క చెరువులు, కుంటలు కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, కాలువలను కాపాడేందుకు హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే.. బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చేపల అమ్మకానికి సరైన మార్కెట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ బర్ల మంగయాదవ్, మత్స్యకారుల సంఘం, మత్స్యకార్మిక సొసైటీ నాయకులు గుంటి భీంరావు, రాములు, బాబు, శ్రీనివాస్, సీతయ్య, వెంకటేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువులో..

తుర్కయంజాల్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మాసబ్ చెరువులో ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్ సునీల్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, సామ భీంరెడ్డి, గోపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మేతరి దర్శన్, శేఖర్ మామ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌పూర్‌లో హైనా సంచారం

- చిరుతపులి అని భయపడిన గ్రామస్తులు
- ఘటనాస్థలిని పరిశీలించిన అటవీశాఖ అధికారులు

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్‌లో ఆదివారం హైనా సంచారం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బలిజ శేఖర్ వాకింగ్ కోసం గ్రామ శివారులోని వాగువైపు వెళ్లగా హైనా కనిపించింది. దీంతో చిరుతపులి అనుకొని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారి రవీందర్ రెడ్డి విశ్వనాథ్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. హైనా తిరిగిన ప్రదేశంలో కాలి ముద్రలను పరిశీలించారు. వీటి ఆధారంగా ఇది చిరుతపులి కాదని, హైనా అని స్పష్టం చేశారు. హైనా మనుషులను ఏమి చేయదని భయాందోళనకు గురికాకూడదని సూచించారు. లేగదూడలు, గొర్రెలు, మేకలపై దాడిచేసే అవకాశం ఉంటుందని అన్నారు. వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన సూచించారు.

చోరీకి గురైన బైక్‌ల అప్పగింత

తలకొండపల్లి: సీసీ కెమెరాల ద్వారా చోరీకి గురైన బైక్‌లను గుర్తించి బాధితులకు పోలీసులు అందజేశారు. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో శనివారం సంత ఉండడంతో పూల్‌సింగ్ తండాకు చెందిన వ్యక్తి బైక్‌ను పార్క్ చేసి కూరగాయలను కొనడానికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి తన బైక్ కనిపించక పోవడంతో, ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి సీసీ కెమెరాల బైక్‌ను గుర్తించి, ఆ వ్యక్తికి పోలీసులు బైక్‌ను అప్పగించారు. అదే విధంగా మండల పరిధిలోని చీపునుంతల్లో ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాల దగ్గర బైక్ పార్క్ చేశాడు. పని ముగించుకొని వచ్చి చూసే సరికి బైక్ కనపడ లేదు. ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బైక్‌ను బాధితుడికి అందజేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ ఆదివారం చెప్పారు.

ఆకట్టుకున్న నేవీ బ్యాండ్

గచ్చిబౌలి: వివిధ భాషల్లో కొనసాగిన నేవీ బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి కొత్తగూడ, శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో ఇంటర్నేషనల్ నేవీ డే ను పురస్కరించుకుని వైజాగ్ ఈస్టర్న్ నావల్ కమాండ్ బృందం నావల్ బ్యాండ్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ పద్మనాభం పర్యవేక్షణలో బ్యాండ్ నిర్వహించారు. వివిధ భారతీయ భాషల్లో పలు వాయిద్యాలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గీత గోవిందం సినిమాలోని ఇంకేం ఇంకేం ఇంకేం కావాలి పాటతో ఆహూతులను ఉర్రూతలూగించారు. నేవీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా నగరంలో నావల్ బ్యాండ్ నిర్వహిస్తున్నారు. ఈ బృందంలో మొత్తం 39 మంది సభ్యులు ఉన్నారు. వారాంతం కావడంతో శరత్ సిటీ క్యాపిటల్‌కు వచ్చిన వందలాది మంది ఈ ప్రదర్శనను తిలకించారు.

రూ.6.69 లక్షల హవాలా నగదు పట్టివేత

సుల్తాన్‌బజార్: అక్రమంగా హవాలా నగదును తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.6.69 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ శంకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి రిసాల్లాబుల్లాకు చెందిన సంజయ్‌కుమార్ మహంకారి, సుల్తాన్‌బజార్‌కు చెందిన బీమార్ బాయ్ దేవుజీబాయ్ రాజ్‌పుత్, అర్జున్‌బాయ్ చందాజీ రాజ్‌పుత్ ఆదివారం సుల్తాన్‌బజార్ రాయల్ ప్లాజా ఎదురుగా నల్లటి బ్యాగుతో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో ఏసీపీ శంకర్, డీఎస్ఐ నరేష్ వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌ను సోతా చేయగా నుండి రూ.6.69 లక్షల నగదు లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగదును ఐటీశాఖ అధికారులకు అప్పగించారు.

ఇంటింటి సర్వే 75.30 శాతం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే వేగంగా కొనసాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో 75.30 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయిందని జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వేను జాగ్రత్తగా నిర్వహించి, తప్పుల్లేకుండా నమోదు చేస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు 18,26,564 కుటుంబాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు.

పత్తి రైతు పరేషాన్



మరియాపురంలో ఓ ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

తగ్గిన పంట దిగుబడి

- ధర లేక దిగాలు
- దళారులకు అమ్మి నష్టపోతున్న రైతు

షాబాద్: ఏటా పత్తి రైతు ఏదో ఒక రకంగా చిత్తవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడం, అకాల వర్షాలు కురుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాడు. రూ.వేల పెట్టుబడి పెట్టి సాగుచేస్తే ప్రతికూల వాతావరణంలో అంతంత మాత్రమే దిగుబడి వస్తోంది. ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకునేందుకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులకు సరైన అవగాహన లేక దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7,521 మద్దతు ధరను ప్రకటించగా దళారులు క్వింటాలు పత్తిని రూ.6400 నుంచి రూ.6500 ధరతో కొనుగోలు చేస్తున్నారు.

అనుకూలించని వాతావరణం

సీజన్ మొదట్లో పత్తి విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తనాలు వేసినా వర్షాల్లేక రెండు, మూడుసార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. పత్తి పూత దశకు వచ్చిన సమయంలోనూ భారీ వర్షాలు పడ్డాయి. పంట పొలాలు నీట మునిగి పూత, కాయ నేలవాలాయి. నీటిలో మునిగి తెగుళ్ల సోకి దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఈసారి విత్తనాలు, ఎరువుల ధరలు భారీగా పెరిగాయని వాపోతున్నారు.

కూలీల భారం

పంట సాగు చేయడం ఒక వంతు అయితే దాని ఏరివేత రైతులకు ఇబ్బందికరంగా మారింది. పత్తి ఏరివేతకు సరిపడా కూలీలు దొరక్కపోవడంతో అవస్థలు పడుతున్నారు. పత్తి ఏరివేతకు కిలోకు రూ.10 నుంచి రూ.12 కూలీ చెల్లిస్తున్నారు. రైతులు ఆయా గ్రామాలకు వెళ్లి కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో చేలకు తరలిస్తున్నారు. వాహనాల ఖర్చులతో పాటు కిలో పత్తికి రూ.12 వరకు చెల్లించాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా అదనపు భారం పడుతుందని రైతులు అంటున్నారు.

మోసపోతున్న రైతులు

సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ కొనుగోళ్లలో జాప్యంతో పాటు రైతులకు సరైన అవగాహన లేక రైతులు దళారులకు పంటలను విక్రయిస్తున్నారు. రైతులు ఇంట్లో పత్తి నిల్వ చేసుకోలేక తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని దళారులు నాసిరకంగా ఉందని సాకులు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది.

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. ఈసారి పూత, కాత సమయంలో వర్షాలు పడి పంట దెబ్బ తింది. దీంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కల్పించాలి.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం, షాబాద్

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



పోలీసుల అదుపులో నిందితుడు

కందుకూరు: మేకలు మేపడానికి వెళ్లిన ఓ మహిళ మెడలో నుంచి నకిలీ బంగారు పుస్తెలతాడును ఓ దొంగ తస్కరించాడు. గ్రామస్తులు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవెల్లికి చెందిన జగదీశ్వర్ మేకలు మేపుకొంటూ జీవిస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం పని నిమిత్తం గ్రామ సమీపంలో ఉన్న బేగంపేట గ్రామానికి వెళ్లాడు. మేకలను తల్లిదండ్రులు వానరాసి జంగమ్మ, వీరాస్వామికి అప్పజెప్పాడు. దీంతో వారు మేకలను గ్రామ సమీపంలో మేపడానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వీరాస్వామి మేకలకు నీళ్లు తాగించడానికి పక్కనే ఉన్న మామిడి తోటలోకి కొట్టుకెళ్లాడు. ఆ సమయంలో రహదారి పక్కనే ఉన్న పొలంలో జంగమ్మ ఒంటరిగా కూర్చొని ఉంది. గుమ్మడవెల్లి వైపు నుంచి ఓ దుండగుడు బైక్‌పై వచ్చి ఒంటరిగా కూర్చొని ఉన్న ఆమె వద్దకు వచ్చి చిరునామా అడుగుతున్నట్లు నటించి మెడలో ఉన్న రూ.2 వేల విలువ గల నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. దీంతో ఆమె కుమారుడు జగదీశ్వర్‌కు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే అప్రమత్తమైన అతను గ్రామస్తులతో కలిసి బేగంపేటలో ఆ బైక్‌ను అడ్డుకుని దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతో పాటు వేదాలు నేర్చుకోవాలి

బ్రాహ్మణ సమాఖ్య పాలమూరు జిల్లా అధ్యక్షుడు జోషి గోపాలశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జోషి గోపాల శర్మ

షాద్‌నగర్: బ్రాహ్మణులు చదువుతోపాటుగా వేదాలు నేర్చుకోవాలని బ్రాహ్మణ సమాఖ్య పాలమూరు జిల్లా అధ్యక్షుడు జోషి గోపాల శర్మ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని పరిగి రోడ్డులో సంతోష్‌కుమార్ తోటలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బ్రాహ్మణులందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. తద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. వేదాలు నేర్చుకోవడానికి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంచి కామకోటి పీఠాధిపతులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత బ్రాహ్మణులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మంగు రాఘవరావు, సభ్యులు ఎంకే రాజేంద్రప్రసాద్, రామ సత్యనారాయణ, సంబురాజు రవిశర్మ, స్వరూప్ సిద్ధాంతి, ప్రవీణ్, మహేష్‌శర్మ, భానుశర్మ, కృష్ణ శర్మ, రఘునాథ్ శర్మ, శ్రీమతమ్మ, గిరిజ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవం

పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సుభాష్‌నగర్ కాలనీ వాసులు ఆదివారం కాలనీలోని పార్కులో వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సీఐడీ పీసీఆర్ సెల్ అధికారి డాక్టర్ లావణ్య



మహిళా సదస్సులో పాల్గొన్న ఐపీఎస్ అధికారి లావణ్య తదితరులు

శంకర్‌పల్లి: మహిళలు నేటి సమాజంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని, ఆకాశమే హద్దుగా ఎదగాలని హైదరాబాద్ సీఐడీ పీసీఆర్ సెల్ ఐపీఎస్ అధికారి డాక్టర్.లావణ్య అన్నారు. మండలంలోని దొంతన్‌పల్లి వద్ద ఉన్న ఇక్ఫాయ్ కళాశాలలో ఆదివారం సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫెమినాక్సెల్ కాన్‌క్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐపీఎస్ అధికారి లావణ్య, కళాశాల రిజిస్ట్రార్ విజయలక్ష్మితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. నేడు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఇది మంచి పరిణామమని దీనిని మహిళలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని గుర్తుతెలియని వ్యక్తుల వలలో పడి మోసపోవద్దని సూచించారు. ధైర్యంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రిజిస్ట్రార్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. సమాజ పురోగతిలో మహిళా పాత్ర కీలకమైనదన్నారు. మహాత్మాగాంధీ జీవితంలో కూడా అతని భార్య కస్తూర్బాగాంధీ అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సేఫ్ స్పేస్ ఫౌండర్ అనుష, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయంతిరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ పద్మావతి, జాయింట్ రిజిస్ట్రార్ మధుసుధన్‌రావు, మనేజర్ మురళి తదితరులు ఉన్నారు.

మా గ్రామాన్ని మున్సిపల్‌లో కలపొద్దు

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు దేవునిఎర్రవల్లి గ్రామస్తుల వినతి

చేవెళ్ల: కొత్తగా ఏర్పాటు చేయబోయే చేవెళ్ల మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలుపొద్దని దేవునిఎర్రవల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీగా మార్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే తమ గ్రామాన్ని మాత్రం కలప వద్దన్నారు. మండల కేంద్రానికి తమ గ్రామం దూరంగా ఉండటంతోపాటు ఎక్కువ మంది రైతులు, పేదలు ఉన్నారని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకొని తమ గ్రామాన్ని మున్సిపల్‌కు మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, బక్కయ్య, జంగయ్య, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

మంచాల: క్రీడలు శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు గ్రామీణ యువతను ప్రోత్సహిస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కావలి శ్రీనివాస్, చీరాల రమేష్, సీఐ మధు, నాయకులు మల్ల చంద్రయ్య, సురేష్, రాజు, బుగ్గరాములు, శ్రీనివాస్, భాస్కర్, కృష్ణ, కుమార్, ఏపీఎల్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరుతండాలో ఢీకొన్న రెండు బైకులు



కిశోర్ (ఫైల్)

కొత్తూరు: రెండు బైకులు ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు తండాలో నివాసం ఉంటున్న మంగళి కిశోర్(42) పట్టణంలో హెయిర్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి షాపు మూసిన తర్వాత తన బైకుపై పట్టణం నుంచి ఇంటికి వెళ్తుండగా కొడిచర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్, సందీప్‌లు ఆయన వెనకాల నుంచి అతి వేగంగా బైకుపై వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కిశోర్ తల, చేతికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. శ్రీకాంత్, సందీప్‌లకు సైతం గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

హెరాయిన్ విక్రేతల అరెస్ట్

కీసర: హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కీసర పోలీసుల ప్రత్యేక బృందం ఆదివారం అరెస్ట్ చేసింది. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన శతానా రామ్, జగదీష్ కీసర మండల పరిధిలోని బండ్లగూడ, ఠాకూర్‌నగర్‌లో నివసిస్తున్నారు. వీరు బండ్లగూడలోని ఠాకూర్ పరంధామ్ కాలనీ వద్ద హెరాయిన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన కమలేష్, రాజస్థాన్‌లోని బార్మేర్ జిల్లాకు చెందిన దినేష్ కళియన్ వీరికి సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.



ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దేవునిఎర్రవల్లి గ్రామస్తులు